క్లుప్తంగా

అయ్యప్ప ఆలయంలో కొనసాగుతున్న పూజలు



నర్సంపేట: పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్పస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో చేపట్టిన 23వ మండల పూజా మహోత్సవాలు, అన్నదాన కార్యక్రమాలు సోమవారం 19వ రోజుకు చేరుకున్నాయి. అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శింగిరికొండ సవర్ధకృష్ణ, నితిన్ లక్ష్మికళ, శింగిరికొండ రవీందర్ రమాదేవి, పబ్బా సుదర్శన్ పుష్పలీల, శీలం నాగరాజు స్వరూప, వజ్రమ్మ, నిఖిల్, అఖిల్, వీరస్వామి, శీలం ఎల్లగౌడ్, మంజుల, భానుప్రసాద్ వర్షిత, చిలుకమారి హరికృష్ణ శ్వేత, సాయిరాం, ఆదిత్య స్వాములు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాదారపు చంద్రశేఖర్ గుప్తా, దొడ్డ రవీందర్, శ్రీరాం ఈశ్వరయ్య, దొడ్డ వేణు, మల్యాల రాజు, శింగిరికొండ ఉపేందర్, స్వరాజ్యలక్ష్మి, భూపతి లక్ష్మినారాయణ, రాజశేఖర్, శ్రీరాముల కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



దుగ్గొండి: మండలంలోని మల్లంపల్లి గ్రామంలోని శ్రీకంఠమహేశ్వరస్వామి, రేణుకా ఎల్లమ్మ తల్లి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు నాలుగు రోజులుగా వైభవంగా సాగుతున్నాయి. నాల్గో రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్వామి వార్లకు ఇంటికో బిందె చొప్పున నీళ్లు తీసుకొచ్చి జలాభిషేకం చేశారు. పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చుక్క రమేశ్, గౌడ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షుడు గుండెబోయిన రమేశ్, ఉపాధ్యక్షుడు కక్కెర్ల రామకృష్ణగౌడ్, కార్యదర్శి కందుల శ్రీనివాస్‌గౌడ్, బూర మురళీ, సుభాష్, తడుక కొంరెల్లి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

దుగ్గొండి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని గిర్నిబావి సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని రేకంపల్లి గ్రామానికి చెందిన ఇమ్మడి కార్తీక్, కానుగుల సిద్దూలు వరంగల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గిర్నిబావి సమీపంలో వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్తీక్, సిద్దూలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఇద్దరిని వరంగల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పరమేశ్ మీడియాకు తెలిపారు.

పరామర్శ



ఖానాపురం: మండల కేంద్రానికి చెందిన స్వామి గుండెపోటు గురై సోమవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఎంపీపీ ప్రకాశ్‌రావు పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. స్వామి మృతి బాధాకరమన్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట ఉపసర్పంచ్ మేడిద కుమార్, నాయకులు నాగార్జున్‌రెడ్డి, పోశెట్టి, దాసరి రమేశ్, వడ్డె రాజశేఖర్, తదితరులున్నారు.

వెయ్యి కొబ్బరికాయల మొక్కు చెల్లింపు



గీసుకొండ: పరకాల ఎమ్మెల్యేగా రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలిస్తే స్థానిక శివాలయంలో వెయ్యి కొబ్బరి కాయలు కొడతానన్న మొక్కును మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తాటికొండ నరేందర్ సోమవారం చెల్లించారు. ఎమ్మెల్యేగా ప్రకాశ్‌రెడ్డి గెలిస్తే శివాలయంలో వెయ్యి కొబ్బరి కాయలను కొడతానని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు చాడ కొమురారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు దొడు ప్రవీణ్‌కుమార్, దొడు భరత్, వజ్ర రాజు, నాగరబోయిన సారంగం తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం పనులు.. రోడ్డు గుంతలమయం

- ఐదు నెలలు గడవక ముందే..



రాములునాయక్‌తండాలో రహదారిపై దెబ్బతిన్న రోడ్డు

నర్సంపేట రూరల్ : నాసిరకం పనులతో మండలంలోని గురిజాల క్రాస్ నుంచి గురిజాల, లింగాపురం వరకు వేసిన తారు రోడ్డు గుంతలమయమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలిలా.. మండలంలోని మహేశ్వరం గ్రామ శివారులోని గురిజాల క్రాస్ నుంచి గురిజాల, లింగాపురం మీదుగా కోనాపురం వరకు గత ప్రభుత్వం తారు రోడ్డు మంజూరు చేసింది. ఈ క్రమంలో రూ.6 కోట్ల వ్యయంతో నర్సంపేటకు చెందిన ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకుని పనులను నత్తనడకన సాగించారు. రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం వల్ల ఇబ్బంది పడుతున్నామంటూ ప్రజలు పలుమార్లు ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించడంతో ఎట్టకేలకు మళ్లీ పనులు ప్రారంభించారు. కాగా పనుల్లో నాణ్యత లోపిస్తోందంటూ గురిజాల, ఇతర గ్రామాల ప్రజలు అభ్యంతరం తెలిపారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ గురిజాల క్రాస్ నుంచి గురిజాల, లింగాపురం వరకు రోడ్డు నిర్మించారు. ఈ క్రమంలో ఐదు నెలలు గడవకముందే రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం సైతం పూర్తిగా కాకున్నా గుంతలమయం కావడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోని గుంతలను పూడ్చేలా చూడాలని, నాణ్యత పాటించేలా చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

‘రేవూరి’ గెలుపుతో మరింత బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

సంగెం : పదేళ్ల నిరీక్షణ అనంతరం పరకాల ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డి గెలుపుతో తమపై బాధ్యత పెరిగిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని గౌడ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకాశ్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేశారంటూ శ్రేణులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఇచ్చిన అన్ని హామీలనూ అర్హులు అమలు చేస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ ఇండ్ల రవికుమార్, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆగపాటి రాజు, నాయకులు జనగాం రమేశ్, అచ్చ నాగరాజు, సారంగం, సదయ్య, నర్సింహనాయక్, ఎల్లయ్య, సాంబయ్య, శ్రీకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి గ్రామంలోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు నుంచి మంచినీరు వృథాగా పోతోంది. సదరు ఓహెచ్ఎస్ఆర్‌లోకి గిర్నిబావిలోని మెయిన్ హెడ్ ట్యాంకు నుంచి ప్రతిరోజూ నిర్దేశిత సమయంలో నీరు వస్తుండగా ట్యాంకు నిండగానే బంద్ చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొద్ది రోజులుగా వృథాగా పోతోందని గ్రామస్తులు తెలిపారు. నీరు వృథా పోతుండడంతో ట్యాంకు నిర్మించిన ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో దోమలు ప్రబలుతున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రేణుల చొరవతోనే నాగరాజు గెలుపు



మాట్లాడుతున్న శ్రీనివాస్ నాయక్

పర్వతగిరి : కాంగ్రెస్ శ్రేణుల చొరవతోనే కేఆర్.నాగరాజు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ గ్రామ, బూత్, మండల, అనుబంధ, ఇతర స్థాయిల శ్రేణులు క్రియాశీలకంగా పని చేశారంటూ కృతజ్ఞతలు తెలిపారు. నాగరాజుకు భారీ మెజార్టీని అందించారని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, గ్రామ కమిటీ అధ్యక్షులు కుసుం రాంచందర్, గడ్డం జనార్దన్, సొసైటీ డైరెక్టర్ జూలపల్లి గంగాధర్‌రావు, చిదురు కృష్ణయ్య, ఎంపీటీసీలు బొట్ల మహేంద్ర, సరోజన లచ్చునాయక్, కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు సురేందర్‌రావు, సీనియర్ నాయకులు తరస్‌రావు, చతపతిరావు, నాయకులు రాజేశ్వర్‌రావు, బొట్ల కుమార్ పాల్గొన్నారు.

మండలంలో బీఆర్ఎస్ డీలా

- 19 గ్రామాల్లో కాంగ్రెస్ ఆధిక్యం

గీసుకొండ: మండలంలో బీఆర్ఎస్ డీలా పడింది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అధికంగా ఓట్లు పోలైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. మండలంలోని బొడ్డుచింతలపల్లి, రాంపురం గ్రామాల్లో మినహా మిగతా 19 గ్రామాల్లో బీఆర్ఎస్‌కు మించి కాంగ్రెస్‌కు ఓట్లు పడ్డాయి. కొండా దంపతుల స్వగ్రామమైన వంచనగిరిలో బీఆర్ఎస్‌కు 717 ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 1246 వచ్చాయి. దీంతో ఆ పార్టీకి 529 ఓట్ల ఆధిక్యం లభించింది. జెడ్పీటీసీ ధర్మారావు స్వగ్రామమైన కొనాయమాకులలో బీఆర్ఎస్‌కు 226, కాంగ్రెస్‌కు 496 ఓట్లు రాగా 270 ఓట్ల మెజారిటీ దక్కింది. ప్రధాన గ్రామాలైన గీసుకొండ, ఎలుకుర్తి, మరియాపురం, గంగదేవిపల్లిల్లోనూ కాంగ్రెస్‌కు ఆధిక్యం లభించింది. మండలంలో మొత్తం 28,420 ఓట్లు ఉండగా 24,106 ఓట్లు పోలవగా బీజేపీకి 3039, బీఆర్ఎస్‌కు 8262, కాంగ్రెస్‌కు 11341 ఓట్లు పడ్డాయి.

డివిజన్లలోనూ అంతే..

గ్రేటర్ వరంగల్ నగరంలోని 15, 17వ డివిజన్లలోనూ కాంగ్రెస్‌కు మెజారిటీ లభించింది. 16వ డివిజన్‌లో మాత్రం బీఆర్ఎస్‌కు ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి.

పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తాం



మాట్లాడుతున్న కాంగ్రెస్ హామ్యానాయక్

రాయపర్తి: ఎమ్మెల్యే యశస్విని సహకారంతో పాలకుర్తి నియోజకవర్గంలో పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యశస్వినిరెడ్డికి అత్యధిక మెజార్టీ అందించారంటూ ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ శ్రేణులకు మాత్రమే పథకాలు అందించిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో అర్హులకే పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డితోపాటు ఎన్ఆర్ఐ ఝాన్సీరెడ్డి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సరికొండ కృష్ణారెడ్డి, మాచర్ల ప్రభాకర్, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, పెండ్లి మహేందర్‌రెడ్డి, కృష్ణమాచార్యులు, గోవర్ధన్‌రెడ్డి, చిర్ర మల్లయ్య, చిన్నపాక ఎల్లయ్య, ఉల్లెంగల యాదగిరి, గబ్బెట బాబు, ఖాజామియా, రవి, సుదర్శన్‌రెడ్డి, భగవాన్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, మద్దెల వెంకటేశ్ పాల్గొన్నారు.

వరి కొయ్యలను కాలిస్తే నష్టం



పంట క్షేత్రంలో కాలుతున్న వరి కొయ్యలు (ఫైల్)

వర్ధన్నపేట: రైతులు పంట పొలాల్లోని వరి కొయ్యలను కాల్చవద్దని మండల వ్యవసాయ అధికారి రాంనర్సయ్య చెప్పారు. ఆయన రైతులకు పలు సూచనలు అందించారు. కూలీల కొరత నేపథ్యంలో హార్వెస్టర్‌తో పంట కోతలు చేపట్టడం వల్ల వరి గడ్డి దాణాకు వినియోగించడం లేదని, తద్వారా పశు సంపద సైతం తగ్గిపోతుందని తెలిపారు. వరి గడ్డిని పొలంలోనే వదిలేస్తున్నారని చెప్పారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూముల్లో ఉండే మేలు చేసే సూక్ష్మ జీవులు, ఎర్రలు చనిపోతున్నాయని వివరించారు. భూసారం సైతం తగ్గుతుందన్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల జరిగే అనార్థలను వెల్లడించారు. వరి కొయ్యలను కాల్చకుండా దున్నుకోవడం వల్ల భూమిలో కార్బన్, నత్రజని, పొటాష్ శాతం పెరుగుతాయని తెలిపారు. రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

నర్సంపేట: ప్రజాసమస్యల పరిష్కారమే ఎంసీపీఐ (యూ) ధ్యేయమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారపు రమేశ్ తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసేవ లక్ష్యంగా ఉండాల్సిన రాజకీయాలను వ్యాపారమయం చేసి సాధారణ ప్రజలు పోటీ చేయాలంటే భయపడే స్థితికి తీసుకొచ్చారని ఆందోళన వెలిబుచ్చారు. నైతిక విలువలను మంట కలిపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓట్లు, సీట్లు, అధికారం తమ పార్టీ లక్ష్యం కాదని తేటతెల్లం చేశారు. ఆ దిశలో పాలక పక్షాల దోపిడీ, ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారం నిర్వహించి నైతిక విజయం సాధించినట్లు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఎర్రజెండా మాత్రమే పరిష్కారం చూపగలదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయకపోతే ప్రజాఉద్యమాలు తప్పవని చెప్పారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న శ్రీపాల

నర్సంపేట : స్థానిక తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ గణిత ఉపాధ్యాయురాలు పోరండ్ల స్వాతిని ఆర్ఎల్‌సీ శ్రీపాల అభినందించారు. స్కూల్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో శ్రీపాల మాట్లాడారు. స్వాతి తెలంగాణ మైనార్టీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్‌కు చెందిన 204 స్కూళ్ల నుంచి గణిత ఒలింపియాడ్ ప్రిపరేషన్‌లో మెంబర్‌గా ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఒలింపియాడ్ ప్రిపరేషన్‌కు ప్రత్యేక మెటీరియల్ రూపొందించి విద్యార్థుల భవిష్యత్తుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లోనూ మైనార్టీ పాఠశాలల విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇటు నోటు.. అటు ఓటు

హసన్‌పర్తి: వర్ధన్నపేట ఓటర్లు విచిత్రమైన తీర్పు ఇచ్చారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటు నోటు తీసుకుని ఇంకో పార్టీ అభ్యర్థికి ఓటు వేసినట్లుగా ఎన్నికల ఫలితాల సరళిని చూస్తే తెలుస్తోంది. బీఆర్ఎస్ నియోజకవర్గ అభ్యర్థి తాజా మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బరిలో నిలవగా కాంగ్రెస్ నుంచి నాగరాజు పోటీచేశారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ నిలబడ్డారు. అయితే ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ సాగింది.

భారీగా క్రాస్ ఓటింగ్

ఇక్కడ భారీగా క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ముందుగా ఓటర్లకు బీఆర్ఎస్ పార్టీ నుంచి డబ్బులు ముట్టినట్లు సమాచారం, అయితే, చివరి క్షణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి.. ఓటర్లకు డబ్బులు పంచలేదని ప్రచారం జరిగింది. ఓటర్లు మాత్రం బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన డబ్బులు తీసుకుని కాంగ్రెస్‌కు ఓటు వేసినట్లుగా స్థానికంగా చర్చ జరుగుతోంది. పర్వతగిరి, ఐనవోలు, హసన్‌పర్తి మండలాల్లో క్రాస్ ఓటింగ్ జరిగినట్లు ఫలితాల బట్టి తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ తాయిలాలు ఇవ్వనప్పటికీ ఆ పార్టీకే ప్రజలు ఓట్లేశారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

దామెర: అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో సోమవారం మండల వ్యాప్తంగా ఆ పార్టీ శ్రేణులు సంబురాలు జరిపారు. మండల కేంద్రంలో యువకులు బైక్ ర్యాలీ నిర్వహించి టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేశారు. సీనియర్ నాయకులు గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోషయ్య, ప్రవీణ్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శి భిక్షపతి, ఉపసర్పంచ్ నాగేశ్వర్‌రావుతో పాటు యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఊరుగొండలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, రాంచందర్, కందికొండ సంపత్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఓడినా నైతికంగా గెలిచా..

- బీజేపీ పరకాల అభ్యర్థి డాక్టర్ కాళీప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కాళీప్రసాద్

గీసుకొండ: అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయినా నైతికంగా తానే విజయం సాధించినట్లు బీజేపీ అభ్యర్థి డాక్టర్ కాళీప్రసాద్ తెలిపారు. మండలంలోని ధర్మారంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు సుపరిపాలన అందించాలన్న ధ్యేయంతోనే తాను ఎమ్మెల్యేగా బరిలో నిలిచినట్లు తెలిపారు. బీజేపీకి నియోజకవర్గంలో పట్టు ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ చేసిన మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మి ఓటేశారని చెప్పారు. ప్రజలు తనపై చూపించిన ఆదరాభిమానాలను మరచిపోలేనని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలోని పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తానని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. తాను ఎళ్లవేళలా నియోజకవర్గ ప్రజలకు, పార్టీ శ్రేణులకు అండగా ఉండి పార్టీ బలోపేతానికి పాటు పడతానని తెలిపారు. తాము ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడితే బీఆర్ఎస్, బీజేపీ ఒకటే అని కాంగ్రెస్ అసత్య ప్రచారం చేసిందన్నారు. తాము కష్టపడితే పరిస్థితులు కాంగ్రెస్‌కు అనుకూలించాయని చెప్పారు. సమావేశంలో ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, నాయకులు దేవు సాంబయ్య, రాదారపు శివకుమార్, ముల్క ప్రసాద్, జాన్ విక్రం, కక్కెర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే దొంతి జయకేతనం



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నర్సంపేట: ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు సమష్టిగా కృషి చేసి ఎమ్మెల్యేగా దొంతి మాధవరెడ్డిని గెలిపించారని ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్య గౌడ్, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మసూద్ బేగ్ తెలిపారు. ఎమ్మెల్యేగా మాధవరెడ్డి గెలిచిన సందర్భంగా మాషా అల్లాహ్ పట్టణ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు ఎస్కే.ఖాసీం ఆధ్వర్యంలో సోమవారం కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబయ్య, మసూద్ మాట్లాడారు. మాధవరెడ్డి గెలుపును ప్రజలది, పార్టీ కార్యాలదిగా అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన పార్టీ అధినేత్రి సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకే ప్రజలు, పార్టీ శ్రేణులు కృతనిశ్చయంతో పాటుపడ్డారని చెప్పారు. రాబోయే ఐదేళ్లపాటు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేసి ప్రజల రుణం తీర్చుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో 14వ డివిజన్ కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, మైనార్టీ నాయకులు అయూబ్ ఖాన్, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు సాంబయ్య, బాబా, ఎన్ఎస్‌యూఐ పట్టణ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్, కార్యదర్శి నాంపల్లి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు షేక్ జానీ, షేక్ షాదుల్లా, షేక్ హుస్సేనీ, షేక్ తాజుద్దీన్, అమ్జద్, షేక్ అక్రమ్, సర్వర్ పాల్గొన్నారు.

దొంతికి కేబినెట్‌లో చోటు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌నాయక్

చెన్నారావుపేట: నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి కేబినెట్‌లో చోటు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ కోరారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేసి దొంతి మాధవరెడ్డికి సుమారు 5 వేల మెజార్టీ అందించి గెలుపునకు బాటలు వేశారంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో అందరికంటే సీనియర్ అయిన క్రమంలో ఖచ్చితంగా మంత్రి పదవి ఇవ్వాలని ఆకాంక్షించారు. రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన నేపథ్యంలో మాధవరెడ్డికి కేబినేట్‌లో చోటు కల్పించాలని మండల, జిల్లా నాయకులు ఏకగ్రీవంగా తీర్మాణం చేసినట్టు తెలిపారు. 1981లో రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి అమీనాబాద్ సర్పంచ్‌గా, సొసైటీ చైర్మన్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా సేవలు అందించి 2014లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి ఎమ్మెల్యేగా గెలిచి సోనియమ్మ రుణం తీర్చుకోవడానికి కాంగ్రెస్ పార్టీలో చేరారని చెప్పారు. మాధవరెడ్డి కమిట్‌మెంట్ ఉన్న నాయకుడిగా అభివర్ణించారు. సమావేశంలో సమావేశంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, ప్రజాప్రతినిధులు, శ్రేణులు పాల్గొన్నారు.

‘ఆరు గ్యారంటీ’ల అమలు ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లాగౌడ్

ఖానాపురం: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అధిష్ఠానం ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీ పథకాల అమలు ఖాయమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్ తెలిపారు. మండలంలోని బుధరావుపేట గ్రామంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక వాగ్దానాలు ఇచ్చి అమలును విస్మరించిన బీఆర్ఎస్‌కు ప్రజలకు తగిన గుణపాఠం చెప్పారని తెలిపారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో ప్రజా సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్, మహేశ్, మురహరి, నజీర్, శివచారి, నాగరాజు, ఉపేందర్, ఆఫ్రిదీ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధిని కొనసాగించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అనిమిరెడ్డి

రాయపర్తి: పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి దయాకర్‌రావు చేయగా మిగిలిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ పార్టీ కొనసాగించాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన యశస్వినిని గెలిపించిన ఆ పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధిని నిరంతర ప్రక్రియగా అభివర్ణించారు. మండలాన్ని అభివృద్ధి చేయడంలో పోటీ పడాలని ఆకాంక్షించారు. సమావేశంలో జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ ఐత రాంచందర్, నాయకులు యాదగిరిరెడ్డి, కాంచనపల్లి వనజారాణి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, గుగులోతు జాజునాయక్, వంశీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేఆర్‌కు 3,740 ఓట్ల ఆధిక్యం

ఐనవోలు: అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్.నాగరాజుకు మండల ప్రజలకు అండగా నిలిచారు. నాగరాజు సమీప బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌పై 19,458 ఓట్ల తేడాతో గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. మండలంలోని 16 గ్రామాల్లో 30,062 ఓట్లు ఉండగా 25,990 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 14 మంది అభ్యర్థులు పోటీచేయగా బీఆర్ఎస్ అభ్యర్థి అరూరి రమేష్‌కు 9748, కాంగ్రెస్ అభ్యర్థి నాగరాజుకు 13488, బీజేపీ అభ్యర్థి శ్రీధర్‌కు 1,226 ఓట్లు రాగా మిగిలిన 11 మంది అభ్యర్థులకు 1200, నోటాకు 368 ఓట్లు వచ్చాయి. మండల వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థి కేఆర్ నాగరాజుకు 3,740 ఓట్ల మెజారిటీ కట్టబెట్టారు. దీంతో మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరిపారు.